క్లుప్తంగా

ఎమ్మెల్యే కేపీని కలిసిన దర్శి డీఎస్పీ



ఎమ్మెల్యే కేపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి

మార్కాపురం: మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని దర్శి డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అశోక్‌వర్ధన్‌రెడ్డి శనివారం రాత్రి మార్కాపురంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆర్థిక సాయం

గిద్దలూరు రూరల్: వైపీ యువసేన ఆధ్వర్యంలో యువసేన అధ్యక్షుడు వై.బాలు మండలంలోని కె.ఎస్.పల్లె గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న చిలక చెన్నయ్య అనే వ్యక్తికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. మాజీ ఎంపీపీ కడప వంశీ, వైఎస్సార్ సీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, యర్రారెడ్డి, ఓబులరావు ఉన్నారు.

పత్రాలు వాహనాల్లో ఉంచుకోవాలి

తాళ్లూరు: వాహనదారులు సరైన ధ్రువపత్రాలు వాహనాల్లో ఉంచుకోవాలని ఎస్ఐ ప్రేమ్‌కుమార్ సూచించారు. తూర్పుగంగవరంలో వాహనాలను ఆయన తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు.

శింగరకొండ దర్శిని



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం జ్యేష్ఠ మాసం, ఉత్తర నక్షత్రం దశమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు రేపు

బల్లికురవ: బాల్య వివాహాలు తదుపరి పరిణామాలు నిరోధక చట్టంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు సంతమాగులూరు ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో డీ.సుధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు సంతమాగులూరు ప్రాజెక్టు పరిధిలోని బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని ప్రజాప్రతినిధులు అధికారులతో నిర్వహించే సదస్సుకు రాష్ట్ర బాలల హక్కుల కమిషనర్ బత్తుల పద్మావతి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. బాల్యవివాహాల నిరోధక చట్టం 2006పై జరిగే ఈ సదస్సుకు ప్రజాప్రతినిధులు అధికారులతోపాటు స్వయం సహాయక గ్రూపుల సభ్యులు కూడా హాజరై జయప్రదం చేయాలని సీడీపీవో వివరించారు.

31 నుంచి గంగమ్మతల్లి సంబరాలు



గంగమ్మతల్లి మూలవిరాట్

వేటపాలెం: స్థానిక పాకనాటి వీధిలో వేంచేసియున్న గంగమ్మ తల్లి సంభరాలు ఈ నెల 31 నుంచి జూన్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. 31న పోలేరమ్మ అమ్మవారికి సద్ది, నైవేద్యాలు చెల్లింపులు, జూన్ 1న ఉదయం మహాలక్ష్మీ అమ్మవారికి వడపప్పు, పానకాలు చెల్లింపు, 2న గంగమ్మ తల్లి ఊరేగింపు, వీరదాళ్ల సేవ కార్యక్రమతో సంబరాలు ముగుస్తాయని చెప్పారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



బేస్తవారిపేట: ప్రత్యేక అలంకరణలో సత్యమాంబదేవి



మార్కాపురం టౌన్: పత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు



తాళ్లూరు:ముస్తాబైన అమ్మవారు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండ హారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

గుంటి గంగకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు పదహారు చీరలు బహూకరించారు. ఆలయానికి రూ.12,715 ఆదాయం వచ్చినట్లు ఆర్ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ భాస్కర్‌రెడ్డి పర్యవేక్షించారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మ తల్లి భక్తులను చల్లంగా చూడాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలో ఉన్న పుట్ట, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు.

కలిసి మెలిసి ఉంటేనే బలం

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా

రాచర్ల: కుటుంబ సభ్యులంతా కలిసి మెలిసి ఉంటేనే బలం చేకూరుతుందని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని పాలకవీడు పంచాయతీ పరిధి అనుమలవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్నాటి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పల్నాటి కుటుంబంలోని బంధువులందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. కుటుంబంలోని సభ్యులందరూ ఒకేచోట కలుసుకుని పరిచయం చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. అనంతరం పల్నాటి కుటుంబ సభ్యులందరూ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబుకు ఘన సన్మానం చేశారు. మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పనారెడ్డి, నంద్యాల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎస్ఎండీ నౌమాన్ సాహెబ్, ఎంపీపీ షేక్ ఖాశిం బీ, పాలకవీడు సర్పంచ్ పల్నాటి లతీఫ్, పల్నాటి గౌస్ అహ్మద్, పల్నాటి సుభాహన్, పల్నాటి రహిమాన్, పల్నాటి మహబుబ్ పీరా, పల్నాటి మహబూబ్ బాషా, పల్నాటి అయూబ్, పల్నాటి యాసిన్, పల్నాటి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా కొనకనమిట్ల బస్టాండ్

● నిలిచిన బ్రిడ్జి నిర్మాణాలు



అర్ధంతరంగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణం

కొనకనమిట్ల: కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్ అస్తవ్యస్తంగా తయారైంది. ఎన్‌హెచ్‌ఏ 565 జాతీయ రహదారిగా అభివృద్ధి చేశారు కానీ కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్లో మాత్రం రోడ్డు, బ్రిడ్జి నిర్మాణాల పనులు నిలిపారు. కొద్దిపాటి వర్షం పడినా బస్టాండ్ వద్ద నిల్చునే పరిస్థితి కూడా లేదు. 2015లో మార్కాపురం-పొదిలి రహదారిలో కొంత భాగం, దొనకొండ అడ్డరోడ్డు- కనిగిరి, నెల్లూరు జిల్లా దుత్తలూరు, దోర్నాల వరకు జాతీయ రహదారి పూర్తి చేశారు. అంత వరకు బాగానే ఉన్నప్పటికీ కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్లో మాత్రం రోడ్డు వేయకుండా, బ్రిడ్జిలు నిర్మాణం పూర్తి చేయకుండానే సదరు కాంట్రాక్టర్ పనులు నిలిపేశారు. దీంతో బస్టాండ్ సెంటర్ వాహనాల రాకపోకల వల్ల సెంటర్లో ఉన్న దుకాణాలు, బడ్డీ బంకులు, హోటల్స్ దుమ్ముధూళితో నిండిపోతున్నాయి. వాహనాల టైర్ల కింద పడిన కంకర రాళ్లు ఎగిరి వాహన చోదకులు, పాదచారులను తగులుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బస్ షెల్టర్ లేక ఇబ్బందులు..

గతంలో కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్లో ఉన్న బస్ షెల్టర్‌ను రహదారి అభివృద్ధిలో భాగంగా తొలగించారు. మళ్లీ షెల్టర్ ఏర్పాటు చేయకుండా వదిలేశారు. బస్టాండ్‌లో షెల్టర్ లేకపోవడంతో బస్‌ల కోసం వేసి ఉండే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు దంచికొడుతుండటంతో ప్రయాణికులు బంకుల వద్ద తలదాచుకోవాల్సిన దుస్థితి. ప్రయాణికుల అవసరార్థం బస్ షెల్టర్ నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



తాళ్లూరు: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తాళ్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు దశాబ్దాల క్రితం ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. నాడు తమ అభ్యున్నతికి పాటుపడిన గురువుల సేవలు గుర్తు చేసుకున్నారు. నాటి గురువులు డి.వెంకటేశ్వరరెడ్డి, మాస్టర్లు వీవీ రమణయ్య, ఎం.సుబ్బారావు, ఎస్.అంజిరెడ్డి, వి.ఆంజనేయులు, ఏవీ సుబ్బారావు, బి.కోటిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఆయా బ్యాచ్‌లో నాటి విద్యార్థులు సీహెచ్ నాగేశ్వరరావు, కోటిరెడ్డి, ఎస్.కొండారెడ్డి, రమణమ్మ, వెంకటేశ్వరరెడ్డి, పరదేశి, ఎస్.కొండ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్ధవీడు (కంభం): మండలంలోని దొనకొండ హైస్కూల్ 2004-2005వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలిశారు. ఈ సందర్భంగా గతంలో వారితో చదువుకున్న స్నేహితుల జీవితంలోని విశేషాలు గురించి ఒకరినొకరు తెలుసుకుని ఆనందపడ్డారు. వెనుకటి రోజుల జ్ఞాపకాలు గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు గాదం పుల్లారెడ్డి, భాస్కర్, నాగలక్ష్మి, రంగరత్నం, సత్యం నారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



క్షతగాత్రుడిని బయటకు తీస్తున్న 108 సిబ్బంది

మార్టూరు: జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం ఉదయం బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద జరిగింది. బల్లికురవ 108 సిబ్బంది సురేష్ వివరాల మేరకు.. గుంటూరు సమీపంలోని వెంగళాయపాలేనికి చెందిన చర్చి పాస్టర్ ఆర్ ప్రసాదరావు తమ సంఘ సభ్యులతో నెల్లూరులో జరుగుతున్న ప్రార్థనా కూటముల కోసం వెళ్లి శనివారం అర్ధరాత్రి గుంటూరుకు వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. బొల్లాపల్లి టోల్ ప్లాజా సమీపంలో వీరి వాహనం రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టడంతో ప్రసాదరావు తీవ్ర గాయాలతో వాహనం క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. వెనుక ఉన్న మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయట పడగా టోల్ ప్లాజా సిబ్బంది అతి కష్టంతో ప్రసాదరావును వాహనం నుంచి బయటకు తీశారు. క్షతగాత్రులను చిలకలూరి పేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రేపటి నుంచి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాలు

పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరు గ్రామంలో ఉయ్యాల పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాలను ఈ నెల 30, 31, జూన్ 1వ తేదీ ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకుడు బాచిమంచి అరుణకుమార్‌శర్మ ఆధ్వర్యంలో మంగళవారం గణపతి పూజ, అఖండదీప స్థాపన, యాగశాల సంస్కార, అంకురారోపణము, జలాధివాసం, అగ్ని ప్రతిష్ఠ, దీక్ష హోమం, బుధవారం సర్వదేవతా ప్రార్థన, మండప దేవతా పూజలు, పంచగవ్య, పంచామృత, గురువారం ఉదయం 8.08 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహాల ప్రతిష్ట, విగ్రహాల బిగింపు, తదితర పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులకు మూడు రోజుల పాటు అన్నదానం ఉంటుంది.

నాటిక పోటీలకు విశేష స్పందన



కమనీయం నాటికలో ఓ సన్నివేశం

పర్చూరు (చినగంజాం): జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న నాటక పోటీలకు విశేష స్పందన లభిస్తోంది. మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో కళానికేతన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించడంతో పాటు విశేష స్పందన వ్యక్తమవుతోంది. రెండో రోజు పోటీలను తిలకించేందుకు కళాకారులు, కళాభిమానులు భారీగా తరలివస్తున్నారు. ప్రత్యేక ఆహ్వానితులచే జ్యోతి ప్రజ్వలన, నటరాజ పూజల అనంతరం నాటిక పోటీలను శనివారం రాత్రి ప్రారంభించారు. న్యూ స్టార్ మోడరన్ ఆర్ట్స్ విజయవాడ వారి కపిరాజు నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. రామలక్ష్మణుల గర్వం, అహంకారాన్ని వీడి భగవంతులయ్యారని రామాయణం, మహాభారతాలు చెబుతున్నాయి. అహంకారం మనిషిని పతనావస్థకు చేరుస్తుంది. అహంకారం గర్వం వల్ల మనిషి ఎంత నష్టపోతాడో తెలిపే కపిరాజు నాటిక వృత్తాంతం. అనంతరం సద్గురు కళానిలయం గుంటూరు వారి కమనీయం నాటిక కళా సంపదకు నిలువుటద్దం. సినీ, నాటక రంగాల్లో కాలక్రమేణా అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎన్ని మార్పులు వచ్చినా నాటికలు,నాటకాలను చూసేందుకు ప్రేక్షకులు రంగస్థలం వద్దకు తప్పక రావాలన్న ఇతివృత్తంతో ఈనాటిక సాగింది. తదనంతరం ప్రదర్శించిన ఆలీతో సరదాగా, నాన్నా నేనెళ్ళొస్తా నాటికలు కూడ ప్రేక్షకులను మరింత ఆనందింపజేశాయని నిర్వాహకులు చిట్టినేని సాయిబాబు,.కోలా శ్రీనివాసరావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గోరంట్ల రాంబాబు, యార్లగడ్డ రామకృష్ణలు తెలిపారు.

హజ్ యాత్రికులకు మంత్రి సురేష్ శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: హజ్ యాత్రకు వెళ్తున్న వారికి రాష్ట్ర పురపాలక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు షేక్ జానీబాషా కుటుంబం సోమవారం హజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి ఆదిమూలపు సురేష్, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు 45 రోజుల హజ్ యాత్ర గురించి జానీబాషాను వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హజ్ యాత్రను ప్రశాంతంగా ముగించుకుని ఆనందంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఫాబీర్‌బాషా, సొసైటీ డైరెక్టర్ రఘు, ఎంపీటీసీ రాము పాల్గొన్నారు.

పిల్లల్లో నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ కోటిరెడ్డి

దర్శి: పిల్లల్లో నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలని ఝాన్సీ నర్సింగ్ హోం వైద్యుడు డాక్టర్ భవనం కోటిరెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బాలోత్సవం ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయురాలు శేష శైలజ పెయింటింగ్ వేసి మెళకువలపై శిక్షణ ఇచ్చారు. చిల్డ్రన్స్ క్లబ్ జిల్లా నాయకులు వినోత్ పొడుపు కథలు, ఫన్ గణితం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కోటిరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలు, డ్రాయింగ్, నీతి కథలు, దేశ భక్తి, డ్యాన్స్ పోటీలు, పాటలు పాడటం చిన్నప్పటి నుంచే నేర్పిస్తే మేధోసంపత్తి పెరుగుతుందని చెప్పారు. బాలోత్సవంలో అధిక సంఖ్యలో పిల్లలు పాల్గొనటం అభినందనీయమన్నారు. ప్రజా సంఘాల నాయకులు మహిళలు ఉప్పు రామాదేవి, నారాయణ, డీవైఎఫ్ఐ కార్యదర్శి కేవీ పిచ్చయ్య, ఈమని నాగేశ్వరరావు, కావ్య, రక్షిత, రవితేజ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

యువతకు క్రీడా నైపుణ్యం అవసరం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై శ్రీహరి

పుల్లలచెరువు: యువతకు క్రీడా నైపుణ్యం ఎంతో అవసరమని పుల్లలచెరువు ఎస్సై శ్రీహరి అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దివంగత కంచర్ల వీరయ్య జ్ఞాపకార్థం వీరయ్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆదివారం ఎస్సై ప్రారంభించి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. కొన్ని గ్రామాల్లో చదువుకున్న యువకులు చెడు వ్యసనాలకు బానిసలయ్యారని, అలాకాకుండా చదువును సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్సై పిలుపునిచ్చారు. క్రికెట్ పోటీల్లో మొత్తం 30 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, సొసైటీ డైరెక్టర్ రఘు, ఎంపీటీసీ రాములు, నాయకులు శ్రీనివాసరెడ్డి, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై కిశోర బాలికలు జాగ్రత్తలు పాటించాలి



వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మార్కాపురం టౌన్: కిశోర బాలికలు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని 34వ వార్డు ఇన్చార్జి రోజ్ లీడియా తెలిపారు. ఆదివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో హరిజనపాలెం కోడ్ నంబర్ 22 పరిధిలో అవగాహన ర్యాలీని సూపర్‌వైజర్ ఎం.బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించారు. కిశోర బాలికల ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కె.రవికుమారి, టి.విజయలీలావతి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే అన్నాను ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: మండలంలోని తిమ్మాపురంలో నూతనంగా ప్రారంభిస్తున్న దేవతా విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి హాజరు కావాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కోటా నరసింహులు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబును ఆయన నివాస గృహంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామంలో జూన్ 3,4,5వ తేదీల్లో 108 శివలింగాల ప్రతిష్ఠ, 14 రకాల దేవతా మూర్తుల ప్రతిష్ఠ మహోత్సవాలకు రావాల్సిందిగా గ్రామస్తులు కలిసి ఆయన్ను ఆహ్వానించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరు గ్రామంలో వలంటీర్లకు వందనం, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాసర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు వలంటీర్లకు వందనం, సాయంత్రం 4 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరవుతారని చెప్పారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, వలంటీర్లు పాల్గొనాలని ఆయన కోరారు.